సాక్షి పెద్దపల్లి

సోమవారం । 23 । జనవరి । 2023



శరణు శరణు మల్లన్న

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు, కుంకుమపూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలీస్ ప్రీమియర్ లీగ్ విజేత పెద్దపల్లి



గెలిచిన జట్టుతో డీసీపీ రూపేశ్

రామగిరి: మండలంలోని సెంటనరీకాలనీ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఫైనల్స్ పోటీ ఉత్కంఠ భరితంగా సాగింది. ఫైనల్‌లో పెద్దపల్లి, సుల్తానాబాద్ జట్లు పోటీపడగా పెద్దపల్లి విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు డీసీపీ రూపేశ్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు గిరిప్రసాద్, సారంగపాణి, సీఐలు ప్రదీప్, ఇంద్రసేనారెడ్డి, రమేష్, సతీష్, గోపాల్, ఎస్సైలు మహేందర్, ఉపేందర్‌రావు, షేక్‌మస్తాన్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–2 ఉచిత శిక్షణ దరఖాస్తులకు 25 తుదిగడువు

పెద్దపల్లిరూరల్: గ్రూప్–2 పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 25లోగా ఉచిత శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కరీంనగర్‌లోని బీసీ ఉద్యోగ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం, బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిర్వహించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.వెయ్యి ఉపకారవేతనం, శిక్షణ మెటీరియల్ అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ కార్యాలయ ఫోన్ నంబరు 0878- 2268686లో సంప్రదించాలని తెలిపారు.

అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



రాధ

యైటింక్లయిన్‌కాలనీ (రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీకి చెందిన, ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1లో విధులు నిర్వహిస్తున్న కార్మికుడు బుగ్గాజీ భార్య కంటివాడ రాధ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 21 నుంచి మెదక్‌లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రాధ పాల్గొని 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ, వంద మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం దక్కించుకుంది. ఫిబ్రవరి 15, 16 తేదీల్లో హరియాణ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా బుగ్గాజీ దంపతులను సింగరేణి ఉద్యోగులు, కాలనీవాసులు అభినందించారు.

నేడు కేంద్రీయ విద్యాలయంలో పెయింటింగ్ పోటీలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక వ్యక్తీకరణలను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా విద్యా మంత్రిత్వ శాఖ వివిధ కార్యాకలాపాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. పోటీల్లో ఐదు ఉత్తమ ఎంట్రీలకు స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలు, ప్రశంసాపత్రాలు అందించడం జరుగుతుందన్నారు.

సొంత ఖర్చుతో తాగునీరు అందించాలి



సమావేశంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి యాజమాన్యం సొంత ఖర్చుతో కార్మిక కుటుంబాలకు శుద్ధి చేసిన నీటిని అందించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. కార్మికులకు మిషన్ భగీరథ నీటిని అందించాలని సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపితే ఏటా రూ. 120 కోట్లు చెల్లిస్తే మిషన్ భగీరథ నీళ్లు అందిస్తామని చెప్పారన్నారు. కార్మికుల కుటుంబాలకు మిషన్ భగీరథ నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు రంగు శ్రీనివాస్, గౌతం గోవర్ధన్, ఎస్.వెంకట్‌రెడ్డి, పర్లపెల్లి రామస్వామి పాల్గొన్నారు.

మనమెంత భద్రం..?!

- అగ్నిప్రమాదం జరిగితే ఆగం కావాల్సిందేనా..
- జిల్లాలో మూడు అగ్నిమాపక కేంద్రాలు
- నాలుగు అగ్నిమాపక వాహనాలు
- ఫైర్ స్టేషన్‌ల పరిధి ఎక్కువ.. సిబ్బంది లేక ఇబ్బంది
- సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు అదనం



ఇటీవల పెద్దపల్లిలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫైర్‌వర్క్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



గోదావరిఖనిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో పక్కపక్కనే ఉన్న వ్యాపార సముదాయాలు

గోదావరిఖని(రామగుండం): సిబ్బంది తక్కువ.. గ్రామాలెక్కువ.. ఇరుకుగా వ్యాపార సముదాయాలు.. రాష్ట్ర రాజధానిలో జరిగిన వరుస అగ్నిమాదాల్లా ఇక్కడ జరిగితే మన పరిస్థితి ఏమిటి? అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునేందుకు అగ్నిమాపక సిబ్బంది ఎంత? అందుబాటులో ఉన్న వాహనాలెంత? ఇలా చూస్తే పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న జిల్లాలో అరకొరగా సౌకర్యాలున్నాయి. అగ్నిమాపక కేంద్రాల్లో సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

సకాలంలో చేరుకోవడం ఇబ్బందే..

- జిల్లాలోని మూడు ఫైర్ స్టేషన్లలో 12మంది సిబ్బంది తక్కువగా ఉన్నారు. అలాగే ఒక్కో ఫైర్‌స్టేషర్ రేంజ్ ఎక్కువగా ఉండటంతో అగ్నిప్రమాదం జరిగినప్పుడు సకాలంలో ఘటన స్థలానికి చేరుకోకపోవడం మూలంగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.
- జిల్లా కేంద్రం నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో అగ్ని ప్రమాదం జరిగితే అక్కడికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటోంది.
- ఇటీవల జిల్లా కేంద్రంలో రెండు భారీ ప్రమాదాలు జరిగాయి. ఎస్‌ఆర్‌ఆర్ ఫైర్‌వర్క్స్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. జిల్లాలోని 3 అగ్నిమాపక వాహనాలు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశాయి.
- అదే వ్యాపార సముదాయాల్లో ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పడం కష్టసాధ్యంగా మారుతుందని పలువురు అంటున్నారు.
- వ్యాపార సముదాయాలకు సంబంధించి కట్టడాలు ఇరుకుగా ఉండటంతో అగ్నిప్రమాదం జరిగితే చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- అలాగే ఫైర్ ఫైటింగ్ వాహనాలు ఘటన స్థలాలకు వెళ్లలేని ప్రాంతాలు కూడా ఉన్నాయి. నూతన కట్టడాలకు ఇబ్బంది లేనప్పటికీ గోదావరిఖని లక్ష్మీనగర్ లాంటి ప్రాంతాల్లో గతంలో నిర్మించిన కట్టడాలు కావడంతో అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగితే పరిస్థితి ఇబ్బందిగానే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

జిల్లాలో..	
ప్రధాన కేంద్రం	గోదావరిఖని
అగ్నిమాపక కేంద్రాలు	మూడు
అగ్నిమాపక వాహనాలు	నాలుగు
ఉండాల్సిన సిబ్బంది	48 మంది
ఉన్న సిబ్బంది	36 మంది
సిబ్బంది కొరత	12 మంది

పారిశ్రామిక ప్రాంతంలో కీలకం..

జిల్లాకు ప్రధాన ఆదాయ కేంద్రమైన పారిశ్రామిక ప్రాంతం రామగుండంలో ఒకటే ఫైర్ స్టేషన్ ఉంది. ఇందులో రెండు అగ్నిమాపక వాహనాలున్నాయి. అయితే సిబ్బంది తక్కువగా ఉండడంతో ఒక వాహనాన్ని మాత్రమే వాడుతున్నారు. మరో వాహనాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. అయితే ఈప్రాంతంలో రెండు వాహనాలకు సరిపడా సిబ్బందిని కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేకంగా..

పారిశ్రామిక సంస్థలు ప్రత్యేకంగా అగ్నిమాపక వాహనాలను ఏర్పాటు చేసుకున్నాయి. సింగరేణి సంస్థ గనుల్లో ప్రమాదాలు జరిగితే భారీ ట్యాంకర్లను ఏర్పాటు చేసుకుంది. అలాగే ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థలు కూడా సొంతంగా అగ్నిమాపక వాహనాలను సమకూర్చుకున్నాయి.

రిస్క్‌జోన్లపై ప్రత్యేక దృష్టి

అగ్నిప్రమాదాలు జరిగే రిస్క్‌జోన్లపై అగ్నిమాపక అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పెట్రోల్ బంక్‌లు, జిన్నింగ్ మిల్స్, రైస్‌మిల్లులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తూ వారిని అప్రమత్తం చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం..



అగ్నిప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఫైర్ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు శాయశక్తులా పోరాడుతున్నాం. రిస్క్‌జోన్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వారంలో ఒక రోజు మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. కమర్షియల్ భవనాలు 15 మీటర్ల ఎత్తు, రెసిడెన్షియల్ భవనాలు 18 మీటర్ల ఎత్తు దాటితే ఫైర్ అధికారుల అనుమతి పొందాల్సి ఉంటుంది.

– ఎస్‌కే ఖాజాఖలీముల్లా, జిల్లా ఫైర్ అధికారి

మౌలిక వసతుల కల్పనలో పాలకవర్గం విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య



పాదయాత్ర నిర్వహిస్తున్న యాకయ్య, నాయకులు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో పాలకవర్గం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య ఆరోపించారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో రెండో రోజు చేపట్టిన పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. రెండో డివిజన్‌లోని ఇందిరమ్మ కాలనీ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, గృహాలు నిర్మించుకుని పదేళ్లు గడిచినా రోడ్లు, డ్రైనేజీ, నీటి సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్యం సరిగా లేక చాలా మంది అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోయారు. కాలనీలో అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర ఇందిరమ్మకాలనీ, పోరట్‌పల్లి, రామయ్యపల్లె, మల్కాపూర్, నర్రాశాలపల్లెలో కొనసాగింది. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను మున్సిపల్ అధికారులకు నివేదిస్తామని వాటిని పరిష్కరించకుంటే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, సీహెచ్.లావణ్య, ఎన్.భిక్షపతి, రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి, నాగలక్ష్మి, రవీందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులు, అనాథ వృద్ధులకు అండగా..

- సుల్తానాబాద్‌లో వృద్ధాశ్రమం ఏర్పాటు
- రూ.70 లక్షల అంచనా వ్యయానికి రూ.50 లక్షలు మంజూరు
- 24న మంత్రి చేతులమీదుగా శంకుస్థాపన

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు వృద్ధాశ్రమం మంజూరు చేసింది. సుల్తానాబాద్ పట్టణంలోని 779 సర్వే నంబర్‌లో 2.20 ఎకరాల భూమిని వృద్ధాశ్రమానికి కేటాయించినట్లు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. రూ.70 లక్షలు నిర్మాణ వ్యయం అంచనా కాగా రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఎన్జీవో ఆర్గనైజేషన్ వృద్ధాశ్రమాన్ని రన్ చేసేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ముందుకు వచ్చింది. 70 శాతం ప్రభుత్వం, 30శాతం రెడ్‌క్రాస్ సొసైటీ భరించనుంది. 200 మంది వృద్ధులు ఉండేలా గతంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయ సమీపంలో ఈ ఆశ్రమం నిర్మాణం కానుంది.



వృద్ధాశ్రమం నిర్మించే స్థలం

24న శంకుస్థాపన

ఈనెల 24న వృద్ధాశ్రమ నిర్మాణానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్సీలు తానిపర్తి భానుప్రసాద్ రావు, ఎల్.రమణ, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సంగీత, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీడబ్ల్యూఓ రవుఫ్‌ఖాన్ తెలిపారు.

నేతకాని సమాజాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేతకాని సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో జరిగిన నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతకాని కులస్తులకు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి రాజకీయంగా సమాజాన్ని గుర్తించడం జరిగిందన్నారు. నేతకాని కులస్తులందరం ఐక్యతతో ఉండి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. అనంతరం నేతకాని తొలితరం నాయకుడు కుమ్మరి మల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో దుర్గం నర్సయ్య, జాడి ముసలయ్య, దుర్గం గోపాల్, కళాలి నరసయ్య, గొల్ల రాజమల్లు, కామెర ప్రకాష్, సెగ్గెం రాజేష్, గంగేష్, దుర్గం నగేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి

- ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు



వైద్య శిబిరంలో జీఎం తదితరులు

రామగిరి(మంథని): సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సంస్థ కృషి చేస్తుందని ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆర్జీ–3 ఓసీపీ–1 ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రత్నాపూర్ రాంగనర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.62.32 లక్షలు, జూలపల్లిలో మల్లన్న ఆలయానికి వెళ్లే దారి నిర్మాణం కోసం రూ.50 లక్షలు, ముల్కలపల్లి బస్ షెల్టర్‌కు రూ.2 లక్షలు, జూలపల్లిలో రెండు చేతిపంపులకు రూ.1.60 లక్షలు, బొక్కల వాగుపై చెక్ డ్యాం ఏర్పాటుకు రూ. 30 లక్షలు, ఐదు గ్రామాల్లో డ్రైయినేజీల నిర్మాణానికి రూ.34.40 లక్షలతో పాటు హరితహారంలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. శిబిరానికి వచ్చిన ప్రజలను వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమ, ఓసీపీ–1 పీవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‘ప్లాన్’కు తుది మెరుగులు

- ప్రభుత్వానికి నివేదించేందుకు సన్నద్ధం
- వచ్చే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక


పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు తుదిమెరుగులు దిద్దుతున్నారు. రోజురోజుకు ఆధునిక పోకడలతో సాగుతున్న అభివృద్ధికి అనుగుణంగా రాబోయే మూడు దశాబ్దాల పాటు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా కొత్తగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. వ్యాపార, పారిశ్రామిక, నివాస ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా అవసరమైన పనులు గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. వీటికి మున్సిపల్ విలీన గ్రామాలను కలుపుకుని రింగురోడ్డు ఉండేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నారని సమాచారం.

పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా..

పెద్దపల్లి పట్టణం జిల్లా కేంద్రంగా అవతరించడంతో వాహనాల రద్దీ పెరిగింది. అందుకనుగుణంగా మున్సిపల్ చుట్టూ రింగ్‌రోడ్డు ఉండేలా రహదారిని నిర్మించి భారీ వాహనాల రాకపోకలు సాగిస్తే రింగ్ రోడ్డుగానే కాకుండా బైపాస్ గానూ ఉపకరిస్తోందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీటికి తోడు పట్టణంలో పరిశ్రమలు, ఆటోమొబైల్ దుకాణాలను శివారు ప్రాంతానికి తరలించి ఇండస్ట్రియల్, ఆటోనగర్ జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

మాస్టర్ ‘ప్లాన్’ ప్రకారమేనా..

పెద్దపల్లి పట్టణ మాస్టర్ ప్లాన్ రూపొందించే సమయంలో పట్టణ ప్రజలు, అందులో విద్యావంతులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులతో చర్చించాల్సి ఉంటుంది. అయితే పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారే తప్ప ప్రజాభిప్రాయ సేకరణ జరపలేదనే విమర్శలున్నాయి.



పెద్దపల్లి పట్టణం

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



పెద్దపల్లి మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. మాస్టర్‌ప్లాన్ అమలు విషయమై ప్రభుత్వం నుంచి అందే ఆదేశాలను బట్టి ముందుకు సాగుతాం. పట్టణంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన రోడ్లను వీలైనంత వెడల్పు చేసి అభివృద్ధి చేస్తున్నాం. మరో రూ.2కోట్లతో పనులు చేపడుతాం.

– శ్రీనివాసరెడ్డి, కమిషనర్ పెద్దపల్లి

వెనుకడుగు వేస్తున్న సర్కార్!

కామారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో మాస్టర్‌ప్లాన్ అమలుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఇటీవల ప్రజలు, రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇక్కడ సైతం మాస్టర్ ప్లాన్ అమలు వ్యవహారాన్ని తాత్కాలికంగా పక్కనబెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటికిప్పుడు మాస్టర్‌ప్లాన్ అమలయ్యే అవకాశాలు అంతంతే అని తెలుస్తోంది. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు స్థానిక నాయకులు, ప్రజలు, రైతులతో సమావేశాలు నిర్వహించి పాలకులు నిర్ణయం తీసుకుంటే ఇలాంటి పరిస్థితులు వచ్చేవి కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

‘డబుల్’ పంపిణీ సాఫీగా సాగేనా..!

- నేడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి సన్నాహాలు
- జెడ్పీ చైర్మన్ క్యాంపు ఆఫీస్ నుంచి ప్రకటన
- ధ్రువీకరించని అధికారులు
- గత అక్టోబర్‌లో 74 మంది లబ్ధిదారుల జాబితాకు ఆమోదం
- అనర్హులకు కేటాయించారని ఆర్డీఓకు ఎమ్మెల్యే ఫిర్యాదు

మంథని: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదోడి సొంతింటి కల ఎట్టకేలకు సాకారంకానుంది. నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు అందించడంలో జాప్యం జరుగగా.. సోమవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులను అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా.. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు అవకాశం కల్పించారని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆర్డీఓ వీరబ్రహ్మాచారికి ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీపై ఉత్కంఠ నెలకొంది.

మూడేళ్లుగా ఎదురు చూపులు

జిల్లాలో మొదటిసారిగా మంథని మున్సిపాలిటీ పరిధి పోచమ్మవాడ శివారులో 2018 సెప్టెంబర్‌లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.5.78కోట్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణంలో ఆటంకాలు, నిధుల లేమి తదితర కారణాలను అధిగమించి 2020 జూన్‌లోనే నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.4.68 కోట్లతో రెండస్తుల్లో 46 చొప్పున 92 ఇళ్లను పూర్తి చేశారు. రహదారులు, మురుగుకాల్వలు ఇతరత్రా అభివృద్ధి పనులను రూ.కోటి పదిలక్షలతో పూర్తి చేశారు. కాగా పంపిణీలో ఆలస్యం జరుగడంతో గత మార్చిలో పలువురు పేదలు ఇళ్ల తాళాలు పగులకొట్టి ఆక్రమణ చేశారు.

74 మంది ఎంపిక

మంథని పోచమ్మవాడలో 92 ఇళ్లు నిర్మించగా గతంలో ఎంపిక చేసిన జాబితాలో అనర్హులకు చోటు కల్పించారనే ఫిర్యాదుల మేరకు మంథని ఆర్డీఓ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ ఫీల్డ్ సర్వే నిర్వహించి 74 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. సదరు జాబితా గతేడాది అక్టోబర్‌లో జిల్లా స్థాయి అధికారులు, మంత్రి ఈశ్వర్ ఆమోదం పొందినట్లు సమాచారం. కాగా 18 మందిని అనర్హులుగా అధికారులు తేల్చారు. నేటి కార్యక్రమంలో 74 మందికి ప్రొసిడింగ్ కాపీలు అందిస్తారా లేక ఒకరిద్దరికి మంత్రి చేతుల మీదుగా అందించి తర్వాత పంపిణీ చేస్తారా అనే విషయంలో స్పష్టత లేదు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సావిత్రీబాయికాలనీగా పేరు

పోచమ్మవాడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీకి సావిత్రీబాయి పూలే పేరు నామకరణం చేసినట్లు సమాచారం. ఈ పేరునే ప్రారంభోత్సవ శిలాఫలకంలో చేర్చినట్లు తెలిసింది. కాగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంథనిలో రాజకీయ వైరం కొనసాగుతోంది. ఇక్కడ ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే, అధికార పార్టీ జెడ్పీ చైర్మన్ మధ్య ప్రోటోకాల్ వివాదం కొంతకాలంగా నడుస్తోంది. పైగా లబ్ధిదారుల ఎంపికలోనూ భేదాభిప్రాయాలు నెలకొనడంతో డబుల్ ట్రబుల్‌గా మారింది. ఈ క్రమంలో పంపిణీ ప్రక్రియ సజావుగా సాగుతుందా లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. రాజకీయ వైరుధ్యం, గతంలో ఎదురైన అనుభవాల నేపథ్యంలో సోమవారం జరిగే కార్యక్రమంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మి (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పారిపెల్లి లక్ష్మి(115) వృద్ధాప్యం కారణంగా వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతిచెందింది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. లక్ష్మి 1908లో జన్మించిందని గ్రామస్తులు తెలిపారు. ఆమె మృతికి సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లె మంజుల సంతాపం ప్రకటించారు.

ఒకే ఈతలో మూడు గొర్రె పిల్లలు


గొర్రె పిల్లలను చూపుతున్న గంగరాజం

రాయికల్(జగిత్యాల): మండలంలోని రామాజీపేటలో మ్యాకల గంగరాజంకు చెందిన గొర్రె ఆదివారం ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనిచ్చింది. ఇలా జరగడం చాలా అరుదు అని మండల పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

విచ్చలవిడిగా గుడుంబా విక్రయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని గ్రామాల్లో గత కొంతకాలంగా విచ్చలవిడిగా గుడుంబా విక్రయిస్తున్నారు. జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్ గ్రామంలో అంతా నిరుపేదలు కావడం, ఇక్కడ పెద్ద ఎత్తున నాటుసారా లభిస్తుండటంతో కొనుగోలు చేస్తున్నారు. గుడుంబా మత్తులో చాలామంది రోడ్ల వెంట పడిపోతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పలువురు లీటర్ గుడుంబాను రూ.80 నుంచి రూ.150 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి బలవన్మరణం

జగిత్యాలక్రైం: బైక్ అడిగితే కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వాడకు చెందిన పుప్పాల వసంత భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వసంత కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో కుమారుడు శశికుమార్(18) తనకు బైక్ కొనివ్వాలని తల్లిపై కొన్ని రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సాధ్యం కాదని ఆమె చెబుతూ వస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన శశికుమార్ శనివారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

పాత్కపల్లిలో మద్యానికి బానిసై ఒకరు..

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని పాత్కపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ప్రశాంత్(28) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ప్రశాంత్ కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. భార్య, కుటుంబసభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కూడా గొడవ పడి, తన గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని మర్చిపోవద్దు


జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి


సర్పంచ్ రమేశ్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న వినోద్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- నుస్తులాపూర్ నూతన పంచాయతీ భవనం ప్రారంభం

తిమ్మాపూర్(మానకొండూర్): పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోవద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. నుస్తులాపూర్‌లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, స్థానిక సర్పంచ్ రావుల రమేశ్‌లతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ రమేశ్ గ్రామంలో ఆడపిల్ల పుడితే కానుకగా రూ.5,116 ఇవ్వడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పని చేస్తోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తనపై గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. రైతుల కోసం 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కాళేశ్వరం నీళ్లతో రాష్ట్రమంతా సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జాతీయ పార్టీగా దేశవ్యాప్తంగా విస్తరిస్తుండటంతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఎల్‌ఎండీ కాలనీ నుంచి నుస్తులాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నుస్తులాపూర్ గ్రామం జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఎంపీగా బండి సంజయ్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్వరూప, గట్టయ్య, రేఖ, రాజు, లావణ్య, కొండయ్య, రమేశ్, పద్మ, తా జుద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. మన్నెంపల్లిలో కుమార్ స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే రసమయి ప్రారంభించారు.

ఉపాధ్యాయులు ఆందోళన చెందొద్దు

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో అందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం టీఆర్‌టీఎఫ్ ప్రతినిధులు కరీంనగర్‌లో ఆయనను కలిశారు. బదిలీలు పదోన్నతులకు సర్కారు పచ్చ జెండా ఊపిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ మాట్లాడుతూ.. 317 జీవో బాధితులకు, 13 జిల్లాల స్పౌజ్ కేసులు, మిస్సింగ్ స్పౌజ్‌ల విషయంలో న్యాయం చేయాలని కోరారు. పండిత పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, పీఎస్ హెచ్‌ఎం పోస్టుల మంజూరు వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సుడా చైర్మన్ రామకృష్ణారావులు టీఆర్‌టీఎఫ్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు సింగిశీల ప్రభాకర్‌రావు, నందికొండ విద్యాసాగర్, తుంగూరి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. అశోక్‌రావు, రాష్ట్ర బాధ్యులు మధుచంద్ర, సర్వర్, కూర రమేశ్, జిల్లా బాధ్యులు హాయ్ లతీఫ్, రమణారావు, భానుప్రకాశ్, మొహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెంజర్లలో అదుపుతప్పి వ్యాన్ బోల్తా

- రోడ్డును గీసుకుంటూ వెళ్లి, ఆర్టీసీ బస్సును ఢీకొన్న వైనం
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
- 35 మంది ప్రయాణికులు సురక్షితం


చెంజర్ల శివారులో ప్రమాద దృశ్యం

మానకొండూర్: మండలంలోని చెంజర్ల శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డును గీసుకుంటూ వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులు పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఆయిల్ డ్రమ్ములతో ఓ వ్యాన్ కరీంనగర్ నుంచి విజయవాడకు వెళ్తోంది. చెంజర్ల శివారులో స్పీడ్ బ్రేకర్ల వద్దకు రాగానే వ్యాన్ డ్రైవర్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేశాడు. ఈ క్రమంలో వ్యాన్ అదుపుతప్పి, బోల్తా పడి, రోడ్డును గీసుకుంటూ ముందుకు వెళ్తోంది. ఇది గమనించిన హుజురాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ జి.శ్రీకాంత్ చాకచక్యంగా వ్యవహరించారు. వెంటనే బస్సును రహదారి పక్కన నిలిపివేశాడు. అయినా వ్యాన్ దూసుకొచ్చి, బస్సును ఢీకొట్టింది. అందులో ఉన్న 35 మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కానీ పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కూడా సురక్షితంగా బయట పడ్డారు. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు నిలిచిపోయి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


పతకాలు అందుకుంటున్న అశోక్, ప్రభాకర్

జమ్మికుంట(హుజూరాబాద్): మెదక్‌లోని ఇందిరా స్టేడియంలో రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం ముగిశాయి. జమ్మికుంట మండలంలోని మడిపల్లికి చెందిన అంబాల ప్రభాకర్, మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్‌లు సత్తా చాటారు. ప్రభాకర్ జావెలిన్ త్రోలో బంగారు, హ్యామర్ త్రోలో కాంస్య, అశోక్ హ్యామర్ త్రోలో బంగారు పతకాలు సాధించారని రాష్ట్ర ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డిలు తెలిపారు. అనంతరం వారికి పతకాలు అందజేశారు. ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు వీరిద్దరూ ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రభుకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా వాణీదేవి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ వాణీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హనుమకొండలోని ఖాదీ కార్యాలయంలో ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ వాణీదేవిని చైర్‌పర్సన్‌గా, కటంగూరి రామచంద్రారెడ్డిని వైస్ చైర్మన్‌గా ప్రతిపాదించగా సెక్రెటరీ వి.కిషన్‌రావు, సభ్యులు బలపరిచారు. దీంతో ఎమ్మెల్సీని ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖాదీ ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆనంద్ మేళా


మేళాను ప్రారంభిస్తున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఆనంద్ మేళా ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో నిర్వహించిన మేళాను ఈడీ సునీల్ కుమార్, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్‌లు జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో దేశ్యాప్తంగా విస్తరించిన ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగుల మానసికోల్లాసానికి కృషి చేస్తోందన్నారు. పలువురు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు కొనుగోలుదారులతో నిండిపోయాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు అధికారులు, దీప్తి మహిళా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గొర్రెల కాపరికి తీవ్ర గాయాలు

- 10 గొర్రెలు మృతి
- నర్సయ్యపల్లె శివారులో ఘటన


మృతిచెందిన జీవాలను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): మండలంలోని నర్సయ్యపల్లె శివారులో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడగా, 10 గొర్రెలు మృతిచెందాయి. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. ఎలిగేడు మండలంలోని శివపల్లికి చెందిన మామిడి ఎల్లయ్య ఆదివారం తన గొర్రెలను మేపేందుకు రోడ్డు పైనుంచి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో 10 జీవాలు అక్కడికక్కడే మృతిచెందగా మరో 5 గొర్రెలకు, ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు .

భార్యను కడతేర్చిన భర్త

- ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చే విషయంలో గొడవపడి, ఘాతుకం
- పరారీలో నిందితుడు
- మృతురాలు కుట్టుశిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్
- బొమ్మారెడ్డిపల్లిలో ఘటన


జ్యోతి (ఫైల్)


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సతీమణి స్నేహలత, ఎంపీపీ కరుణశ్రీ, ఎస్సై అశ్విని


జ్యోతి మృతదేహం

ధర్మారం(ధర్మపురి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి తన భార్యతో గొడవ పడి, చివరికి ఆమెను కడతేర్చి, పరారయ్యాడు. పోలీసులు, మృతురాలి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన సింగిరెడ్డి ఎల్లారెడ్డికి ఇదే మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన జ్యోతి అలియాస్ హేమలతకు 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. దంపతులిద్దరూ కష్టపడి పని చేసుకునేవారు. జ్యోతి మహిళా సమాఖ్యలో చురుగ్గా ఉంటూ ధర్మారంలో సొంతంగా కుట్టుశిక్షణ కేంద్రం నిర్వహిస్తూ ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఫ్యాకల్టీగా పని చేసేది. రెండేళ్లుగా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్‌గా పని చేస్తోంది. ఆమె భర్త ఎల్లారెడ్డి ఆర్టీసీలో కార్గో ఏజెంట్‌గా పనిచేస్తూ, ఓ బస్సును కొనుగోలు చేసి, సంస్థలోనే కాంట్రాక్టుపై నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు వచ్చి, అప్పులు చేశారు. వాటిని తీర్చే విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు జ్యోతి తన ల్యాప్‌టాప్‌లో కుట్టు శిక్షణకు సంబంధించిన వివరాలను నమోదు చేసి, నిద్రపోయింది. ఇద్దరు కూతుళ్లు తమ నానమ్మ రాజమ్మ వద్ద మరో గదిలో నిద్రించారు. ఆదివారం ఉదయం 7 గంటల వరకూ జ్యోతి నిద్ర లేవలేదు. కూతురు వెళ్లి లేపే ప్రయత్నం చేయగా ఉలుకూపలుకు లేకుండా పడి ఉంది. వెంటనే తండ్రి ఎల్లారెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వచ్చింది. రాజమ్మ ఇరుగు పొరుగు వారిని పిలవడంతో వచ్చి, చనిపోయినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్, ధర్మారం ఎస్సైలు శ్రీనివాస్, అశ్వినిలు సంఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. జ్యోతి తలకు గాయం ఉండి, రక్తస్రావం కావడంతో హత్య జరిగినట్లు తేల్చారు. కాగా ఆర్థిక అవసరాలకు, అప్పులు చెల్లించేందుకు వ్యవసాయ భూమిని విక్రయిద్దామని భర్తపై ఒత్తిడి తెచ్చినందుకే హత్య చేశాడని మృతురాలి సోదరుడు రాజేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎల్లారెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. జ్యోతి హత్య విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి, ఎల్‌ఎం ట్రస్టు చైర్‌పర్సన్ స్నేహలత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ బలరాం రెడ్డిలు గ్రామానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

- గేదెను తప్పించబోయి సిమెంట్ గద్దెను ఢీకొన్న కారు
- మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరైన కొద్దిసేపటికే ఆ విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. గాయాలతో బయటపడగా వారు ప్రయాణిస్తున్న కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేటకు చెందిన శ్రీనాథ్, సన్నీ, మహబూబ్‌నగర్‌కు చెందిన అరుణ్, అభిరాం, రామచంద్రారెడ్డి, దేవరాజులు హైదారాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. శనివారం వీరి స్నేహితుడు, కరీంనగర్‌కు చెందిన సాయిచేతన్ పుట్టినరోజు కావడంతో హైదరాబాద్‌లోని కొంపెల్లికి చెందిన లోకేశ్ అనే యువకుడి కారును అద్దెకు తీసుకొని, కరీంనగర్ వచ్చారు. రాత్రి వేడుకలు పూర్తయ్యాక ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు కారులో మానేరు డ్యాం ఉజ్వల పార్కు నుంచి సప్తగిరికాలనీకి వెళ్తున్నారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ స్కూల్ వద్ద గేదె అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి ఎదురుగా ఉన్న సిమెంట్ గద్దెకు ఢీకొట్టారు. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే కారులో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే వచ్చి, మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో అరుణ్‌కు తీవ్ర గాయాలవగా చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

మెడికల్ కాలేజీకి వృద్ధురాలి మృతదేహం


కళావతి (ఫైల్)


నివాళులర్పిస్తున్న మేయర్, వైద్యాధికారులు, ఎన్జీవో ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కోరిక మేరకు మృతదేహాన్ని కుటుంబసభ్యులు మెడికల్ కాలేజీకి దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీకి చెందిన జన్నం కళావతి(65) ఐదేళ్ల క్రితం చెన్నూరులో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నేత్ర, అవయవ, శరీర దానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైంది. అక్కడ తాను మరణించాక శరీరం దానం చేస్తానని వారికి అంగీకార పత్రం ఇచ్చింది. ఈ క్రమంలో ఇటీవల ఆమె ఆరోగ్యం క్షీణించి, ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో ఆమె కోరిక ప్రకారం సోదరులు జన్నం కైలాసం, నాగభూషణం, శంకర్, ధనుంజయ్, రవీంద్రకుమార్, విజయ్‌కుమార్‌లు మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించడానికి ముందుకు వచ్చారు. రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, ప్రతినిధి బెణిగోపాల్ త్రివేది, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, కేఎస్.వాసు, టెక్నీషియన్ ఆరిఫ్‌లు చెన్నూరు వెళ్లి, అంబులెన్స్‌లో కళావతి మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి తీసుకువచ్చారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ సమక్షంలో అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్‌కు అప్పగించారు. ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ అప్పారావు, డాక్టర్ రాహుల్, సెక్యూరిటీ సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళావతి సోదరులను, సహకరించిన ఆర్‌ఎంపీ పి.సత్తయ్యను ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి తదితరులు అభినందించారు.

2007 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లాకు చెందిన 2007 బ్యాచ్ సివిల్ కానిస్టేబుళ్లు ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి 65 మంది హాజరయ్యారు. వీరిలో పలువురు ఇతర ఉద్యోగా లకు ఎంపికైనవారూ ఉన్నారు. తమ ఐక్యత చాటేందుకే ఒక్కచోట చేరామని తెలిపారు. తమలో ఆర్థికంగా ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే అండగా ఉండాలని తీర్మానించారు. ఐదేళ్లకోసారి ఈ సమ్మేళనం నిర్వహిస్తూ ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతామన్నారు. కుమారస్వామి, మల్లేశం, మహేశ్, మహేందర్, కృష్ణంరాజు, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లి శివారులో ఆదివారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి, వారిని పట్టుకున్నామని చెప్పారు. రూ.4,800 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

- తొలుత కుమారుడికి ఉరి బిగించిన వైనం
- చుట్టుపక్కలవారు పరిగెత్తుకురావడంతో ప్రాణాలతో బయటపడిన బాలుడు
- మల్లాపూర్‌లో ఘటన


సోమయ్య (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన సూర సోమయ్య(30)కు ఏడేళ్ల క్రితం కోరుట్ల పట్టణానికి చెందిన కవితతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కవిత కూతుళ్లను తీసుకొని, పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరు కుటుంబసభ్యులు పలుమార్లు సోమయ్య, కవితలతో మాట్లాడి, సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె కాపురానికి రానని తేల్చిచెప్పింది. అప్పటి నుంచి సోమయ్య తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కుమారుడు హేమంత్‌కు ఉరి బిగించాడు. తర్వాత తానూ ఉరేసుకున్నాడు. గమనించిన సోమయ్య తల్లి సాలవ్వ గట్టిగా విలపించడంతో చుట్టుపక్కలవారు పరిగెత్తుకు వచ్చారు. హేమంత్‌ను ఉరితాడు నుంచి విడిపించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సోమయ్య మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు కళాశాల బస్సు డ్రైవర్ ఓదెలు(45) శనివారం ఉదయం విద్యార్థులను బస్సులో తీసుకొని వెళ్తున్నాడు. జ్యోతినగర్ మెయిన్‌రోడ్డుపై ఆటో అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఓదేలును పోలీసులు పోలీసుస్టేషన్‌కు తరలించగా ఫిట్స్ రావడంతో నగరంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.